సాక్షి
వికారాబాద్
శుక్రవారం, 2, మే, 2025



వామ్మో ఎండలు!

పెరుగుతున్న ఎండలతో ప్రజలు బయటకు వచ్చేందుకే జంకుతున్నారు. ఉదయం నుంచే భానుడు భగభగమంటున్నాడు. 8లో▸



ఇందిరమ్మ ఇళ్లపై కసరత్తు!

పేదోడికి ఇళ్లు నిర్మిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేసింది. 9లో▸



బోసిపోయిన 'కోట్‌పల్లి'

భానుడి భగభగల నేపథ్యంలో జిల్లాలోని ప్రముఖ కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల రాక క్రమంగా తగ్గుతోంది. 9లో▸

జెడ్పీ.. ఖాతా ఖాళీ!

నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న మండల పరిషత్‌లు, జీపీలు

- ఉన్న రూ.2 కోట్ల నిధులు భవన నిర్మాణానికే కేటాయింపు
- వేధిస్తున్న అధికారుల కొరత
- జూనియర్ అసిస్టెంట్లతోనే కొనసాగుతున్న కార్యాలయం
- జిల్లా పరిషత్ సేవలు అస్తవ్యస్తం



వికారాబాద్: జిల్లా పరిషత్ సేవలు అస్తవ్యస్తంగా మారాయి. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో కీలకంగా వ్యవహరించాల్సిన జెడ్పీ నామమాత్రమైంది. ప్రస్తుత గడ్డు పరిస్థితిలో ఖాతాలో ఉన్న నిధును మండల పరిషత్‌లు, జీపీలకు కేటాయించాల్సిందిపోయి ఇప్పటికిప్పుడు అవసరంలేని జెడ్పీ భవనం కోసం వినియోగించారు. ఖాతాలో ఉన్న రూ.2 కోట్ల నిధులను భవనానికే కేటాయించి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాలక మండలి ఉన్న సమయంలో అవిశ్వాసం నేపథ్యంలో నిధులు ఖర్చు చేయలేదు. ప్రత్యేకాధికారుల పాలన వచ్చాక ఓ నేత సూచన మేరకు నిధులన్నీ బిల్డింగ్ నిర్మాణానికే కేటాయించినట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో ఉన్న నిధులకు సంబంధించి గత పాలక మండలి సమయంలోనే పనులు చేపట్టేందుకు ప్రొసిడింగులు ఇవ్వగా పాలకమండలి వీటికి తీర్మానం చేయకపోవడంతో అవన్నీ రద్దయ్యాయి. కానీ వీటిలో చాలా వరకు పనులు పూర్తి కావడం గమనార్హం.

పోస్టులన్నీ ఖాళీ

- ఏడాది కాలంగా జిల్లా, మండల పరిషత్‌లలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- జెడ్పీ ఆఫీస్ మొత్తాన్ని జూనియర్ అసిస్టెంట్లతోనే నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొంది.
- ప్రస్తుత సీఈఓ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా మరో నాలుగు అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండటంతో మండల పరిషత్‌ల పర్యవేక్షణ గాలిలో దీపంలా మారింది.
- జిల్లాలో 20 మండలాలు ఉండగా కొత్త మండలాలకు పోస్టులు మంజూరు కాలేదు.
- జిల్లా, మండల పరిషత్‌లలో 19 సూపరింటెండెంట్ పోస్టులకు గాను తొమ్మిది పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.
- ఐదు మండల పరిషత్‌లలో సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- జెడ్పీలో రెండు సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- నాలుగు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఉండగా వీరిలో ఇద్దరు ఇతర మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకరు మెడికల్ లీవ్‌లో ఉండగా మరొకరు చేవెళ్ల ఎమ్మెల్యేకు పీఏగా పనిచేస్తున్నారు.
- నాలుగు సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఉండగా ఇద్దరు వేరే మండలాల్లో విధులు నిర్వహిస్తుండగా ఒకరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మరొకరు చేవెళ్ల ఎమ్మెల్యేకు పీఏగా పని చేస్తున్నారు.

సీఈఓకు ఏడు బాధ్యతలు

- కొత్తగా ఏర్పడిన వికారాబాద్ జిల్లాలో జెడ్పీ కార్యాలయానికి సొంత భవనాన్ని కేటాయించలేదు.
- మండల పరిషత్ కోసం నిర్మించిన భవనంలోనే జెడ్పీ ఆఫీసును ఏర్పాటు చేశారు.
- రెండున్నరేళ్ల క్రితం జెడ్పీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. మొదటి అంతస్తు పూర్తవడంతో మూడు నెలల క్రితం కార్యాలయాన్ని ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకూ ఆఫీసును ఇక్కడికి తరలించలేదు.
- జెడ్పీ సీఈఓ కుర్చీ ఏడాది కాలంగా ఖాళీగా ఉంటూ వస్తోంది. ప్రస్తుత జెడ్పీ సీఈఓకు అదనపు కలెక్టర్‌గా, జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారిగా, వికారాబాద్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు ఉన్నాయి. ఇలా ఒకే అధికారి ఏడు బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తోంది.



రెవెన్యూ, పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

పారిశ్రామికవాడకు భూ సర్వే

- పలువురు రైతుల అంగీకారంతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం
- పులిచర్లకుంటతండాలో 110 ఎకరాలకు హద్దుల నిర్ధారణ
- భారీ బందోబస్తు నడుమ కొనసాగిన సర్వే
- పర్యవేక్షించిన ఎస్పీ నారాయణరెడ్డి

దుద్యాల్: పటిష్ట బందోబస్తు నడుమ రెవెన్యూ అధికారులు గురువారం పారిశ్రామికవాడకు సంబంధించిన భూ సర్వే చేపట్టారు. ఎస్పీ నారాయణరెడ్డి సర్వేను పర్యవేక్షించారు. ఇటీవల పులిచర్లకుంటతండాకు చెందిన పలువురు రైతులు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి పారిశ్రామికవాడ ఏర్పాటుకు రాతపూర్వకంగా అంగీకారం తెలిపారు. దీంతో ఉదయమే తహసీల్దార్ కిషన్ రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు సర్వే నిర్వహించారు. పులిచర్లకుంటతండా గ్రామానికి చెందిన దాదాపు 20 మంది రైతులకు సంబంధించి 110 ఎకరాల పట్టా భూములకు హద్దులు పాతినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్ఐ నవీన్‌కుమార్, సిబ్బంది లాలాప్ప, మారుతి, ఊషనప్ప, వీరేశ్, రైతులు యుగంధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదేబాటలో మిగిలిన వారు

మండల పరిధిలోని హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి, రోటిబండతండా, పులిచర్లకుంట తండాల్లో ప్రభుత్వం పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందుకోసం అవసరమైన భూ సేకరణకు గతంలోనే నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో పోలేపల్లి, హకీంపేట్, లగచర్ల గ్రామాల్లో అసైన్డ్ భూములతో పాటు కొంతమంది పట్టా భూములను రైతుల అంగీకారంతో తీసుకుంది. ఇందుకు పరిహారం సైతం ముట్టజెప్పింది. కానీ రోటిబండతండా, పులిచర్లకుంటతండాలో మాత్రం గిరిజన రైతులు భూములు ఇవ్వడానికి సుముఖత చూపలేదు. దీంతో అధికారులు కొంతకాలం మౌనంగా ఉన్నారు. పులిచర్లకుంటతండాకు చెందిన ఓ రైతు గతంలోనే తన భూమిని పారిశ్రామికవాడకు ఇచ్చారు. దీంతో మరికొంత మంది ముందుకు వస్తున్నారు.

భారీ బందోబస్తు

సర్వే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ నారాయణరెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. గతంలో జరిగిన ఘటనలు దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక బలగాలను మోహరించారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐలు యాదగిరి, సత్యనారాయణ, రవూఫ్, రవిగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్మిక సంఘం నాయకులు

తాండూరు: కార్మికుల హక్కుల సాధన కోసం నెల 20వ తేదీన చేపడుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. గురువారం కార్మిక సంఘాలు, టీజేఎస్ పార్టీ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సోమశంకర్‌లతో కలిసి ఆయన కార్మిక దినోత్సవాన్ని(మే డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్.బీఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్మిక జెండాను ఎగుర వేశారు. అనంతరం సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చేందుకు సిద్ధమవుతోందన్నారు. వేతన జీవులు శ్రమదోపిడీకి గురవుతోన్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రాములు, ఉమేష్, బలరాం, నర్సింహులు, వెంకటప్ప, కిష్టప్ప, అంబరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ రిపోర్టు సకాలంలో పంపాలి

డీఎంహెచ్‌ఓ వెంకటరవణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరవణ

అనంతగిరి: ఎన్‌సీడీ(అసంక్రమిత వ్యాధులు) రిపోర్టులను సకాలంలో పంపాలని జిల్లా వైద్యాధికారి వెంకటరవణ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం వికారాబాద్‌లోని వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎన్‌సీడీలు, సూపర్‌వైజర్‌లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్‌ఎంలు, డీఈఓలకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంక్రమిత వ్యాధుల నివారణ, సర్వే కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఎన్‌సీడీ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలుపర్చడానికి శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ స్క్రీనింగ్ చేయాలన్నారు. గృహ సందర్శన చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి జాబితా పంపాలన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ అబ్దుల్ వాసే, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నిరోషా, ఏఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, సిబ్బంది మహేశ్, రేణుకుమార్, జయరాం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయంపై హర్షం



ఆర్.కృష్ణయ్యకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవికుమార్

మర్పల్లి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య పోరాట పటిమతోనే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతో కులగణన చేపడుతుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రవి కుమార్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఆర్.కృష్ణయ్యకు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త కులగణన చేస్తామనడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆర్.కృష్ణయ్య దశాబ్దాల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు.

శ్రమశక్తి అవార్డు ప్రదానం

మహేదీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నాయకుడు సయ్యద్.అబ్దుల్ రవూఫ్ శ్రమ శక్తి అవార్డును అందుకున్నారు. మే డే సందర్భంగా ప్రభుత్వం తరపున గురువారం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ గిగ్ అండ్ ప్లాట్‌ఫార్మ్ ప్రొఫెషనల్ అధ్యక్షుడైన రవూఫ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

నీటి సమస్య రానీయొద్దు

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- అధికారులతో సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: గ్రామాల్లో నీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ పనులు, రాజీవ్ యువ వికాస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పింఛన్లు తదితర సమస్యలపై ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా స్థానిక వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బోర్లు, పైపు లైన్ల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకంగా ఉండాలన్నారు. అలాగే పలు అంశాలపై కలెక్టర్ మాట్లాడి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, డీఆర్డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, హౌసింగ్ ఈఈ కృష్ణయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్, డీటీసీడబ్ల్యూఓ ఉపేందర్, డీఎండబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి, ఇన్‌చార్జి డీఎస్‌సీడీఓ సత్తార్, డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, పంచాయతీ రాజ్ ఈఈలు ఉమేష్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నీట్ పరీక్షలు

నీట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. తన ఛాంబర్‌లో నీట్–2025 పరీక్ష ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం జరిగే నీట్ పరీక్షకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఐదు కేంద్రాల్లో 1,193 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థులు కేంద్రంలోకి అడ్మిట్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో మాత్రమే తీసుకురావాలన్నారు. అభ్యర్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సూచించారు. నీట్ పరీక్షకు సాయిలత, కుమారస్వామిలని కోఆర్డినేటర్లుగా నియమించారు. మరింత సమాచారం కోసం 08416 235291 ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, డీఈఓ రేణుకాదేవి, ఆర్డీఓ వాసుచంద్ర, సూపరింటెండెంట్ నైమత్ అలీ, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ భీమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సై

- జిల్లాలో 5.63 లక్షల ఎకరాల్లో సాగు ప్రణాళిక సిద్ధం
- 42,064 క్వింటాళ్ల విత్తనాలు అవసరం
- ఏర్పాట్లలో నిమగ్నమైన వ్యవసాయశాఖ

తాండూరు: సాగుబడిలో రైతులు నూతన ఒరవడిని ప్రదర్శిస్తున్నారు. సంప్రదాయ ధోరణికి స్వస్తి చెప్పి వాణిజ్య పంటలపై ఆసక్తి చూపుతున్నారు. అందుకు వానాకాలం సీజన్(ఖరీఫ్)ను అనువైనదిగా ఎంచుకుంటున్నారు. దశాబ్దాలుగా జిల్లాలో కంది, పెసర, మినుము పంటల సాగుకు మక్కువ చూపేవారు. అయితే మూడు నాలుగేళ్లుగా ఇతర పంటలపై మొగ్గు చూపుతున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా కంది పంట విస్తీర్ణం భారీగా పడిపోతూ వస్తోంది.

పత్తి సాగుకు ఆసక్తి

జిల్లాలో 20 మండలాల్లోని రైతులు ఖరీఫ్(2025) సాగుకు సిద్ధమవుతున్నారు. 5.63 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రధానంగా పత్తి, కంది, వరి, పెసర, మొక్కజొన్న, మినుము తదితర పంటలు సాగవుతాయి. ఎక్కువగా పత్తి పంటను రైతులు సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో వానాకాలం జిల్లా వ్యాప్తంగా 2.58 లక్షల ఎకరాలలో ఈ పంట వేసేందుకు సిద్ధమవుతున్నారు. 1.31 లక్షల ఎకరాల్లో వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. 1.14 లక్షల ఎకరాలలో కంది పంట మూడో స్థానానికి పరిమితమవుతోంది. ఈ పంటలకు 42,064 క్వింటాళ్ల విత్తనాలు, సుమారు 70 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. అందుకు సరిపడా మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

జిల్లాలో గతేడాది ఖరీఫ్ ప్రణాళికలో 5.97 లక్షల ఎకరాలలో పంటల సాగుకు అంచనా వేశారు. కానీ ఈసారి మాత్రం 5.63 లక్షల ఎకరాల సాగు ప్రణాళికను రూపొందించారు. దీంతో గతేడాది ఖరీఫ్‌తో పోల్చితే 34,180 ఎకరాల పంట తగ్గినట్లు కనిపిస్తోంది.

కందికి తగ్గుతున్న ఆదరణ

గతంలో ప్రధాన పంటలుగా పప్పు దినుసుల సాగు ఉండేది. కానీ ఏటా భారీగా పడిపోతూ వస్తోంది. ఐదేళ్ల క్రితం జిల్లాలో కంది పంట విస్తీర్ణం 2.50 లక్షల ఎకరాల వరకు సాగయ్యేది. తాజాగా వ్యవసాయాధికారులు ప్రణాళికలో 1.14 లక్షల ఎకరాలకు పడిపోయింది. అదే బాటలో మినుము 5,736 ఎకరాలకు చేరింది. పెసర 14,838 ఎకరాల్లో సాగవుతుంది. తాండూరు కంది పప్పునకు అంతర్జాతీయ స్థాయిలో భౌగోళిక గుర్తింపు లభించింది. దీంతో ఈ పప్పునకు దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. అయినా కర్షకులు మాత్రం కంది సాగుకు అంతగా ఆసక్తి చూపకపోవడం గమనార్హం.



గాజీపూర్‌లో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

విత్తనాల ఎంపికలో జాగ్రత్త



జిల్లా వ్యాప్తంగా 5.63 లక్షల ఎకరాలలో ఖరీఫ్ పంటల సాగుకు కావాల్సిన ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. దళారులను నమ్మి మోసపోవద్దు. వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి. స్థానికంగా ఏఓలు, ఏఈఓలు అందుబాటులో ఉన్నారు. నాణ్యమైన విత్తనాలతోనే పంట దిగుబడులు బాగుంటాయి. వేసవిలో లోతైన దుక్కులు దున్నుకోవాలి.

– మోహన్‌రెడ్డి, వ్యవసాయాధికారి, వికారాబాద్ జిల్లా

దండిగా సహకారం!

- జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రణాళిక
- విరివిగా రుణాలిచ్చేందుకు డీసీసీబీ సిద్ధం
- అన్ని వర్గాల ఆర్థిక ప్రగతే లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో లబ్ధి పొందనున్న ప్రజలు

డీసీసీబీ వివరాలు

మొత్తం పీఏసీఎస్‌లు:	56
డీసీసీబీ బ్రాంచ్‌లు:	35
2025-26 రుణ లక్ష్యం: రూ.3 వేల కోట్లకుపైనే..	
సభ్యత్వం కలిగిన సభ్యులు: 4 లక్షలకుపైగా..	
రుణాలకు అర్హత కలిగిన రైతులు: లక్షన్నరకు పైగా..	

యాచారం: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ఈ ఆర్థిక సంవత్సరానికి దండిగా రుణాలిచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. అర్హత ఉంటే చాలు అడిగినవారందరికీ విరివిగా రుణాలిచ్చేందుకు సిద్ధమైంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.3 వేల కోట్లకుపైగా రుణాలు ఇవ్వడానికి సుముఖంగా ఉంది. కొద్ది రోజుల క్రితం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో జరిగిన సమావేశంలో చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో పాటు పాలకవర్గం, అధికారులు బృందం రుణాలు ఇచ్చే విషయమై నిర్ణయించారు. దీర్ఘకాలికం కింద రూ.250 కోట్లు, స్వల్పకాలికం కింద రూ.100 కోట్లు, బంగారు రుణాల కింద రూ.250 కోట్లు, గృహనిర్మాణ, ఉన్నత చదువుల కోసం రూ.250 కోట్లు, వ్యక్తిగత, ప్లాట్ల కొనుగోలు, వ్యాపార నిమిత్తం.. మరో రూ.2 వేల కోట్లకు పైగా రుణాలిచ్చేందుకు డీసీసీబీ దృష్టి సారించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 56 పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)లు, 35 డీసీసీబీ బ్రాంచ్‌ల నుంచి రుణాల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో దాదాపు లక్షన్నరకు పైగా మంది రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు రుణాలు పొందే అవకాశం ఉంటుంది.

గతేడాది కంటే అధికంగా..

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.2వేల కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకుని రూ.2,150 కోట్ల రుణాలు ఇచ్చింది. గతేడాది డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని 2025–26 ఆర్థిక సంవత్సరానికి మరో రూ.వెయ్యి కోట్లు పెంచుతూ రూ.3 వేల కోట్లకు పైగా అప్పులిచ్చేందుకు సన్నద్ధమైంది. ఈ ఏడాది కొత్తగా (ప్రాజెక్టు) అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత, వాహనాల కొనుగోలు, గృహ నిర్మాణాలతో పాటు కొత్తగా ప్లాట్ల కొనుగోలుకు 60 శాతం మేర రుణాలు ఇవ్వడానికి నిర్ణయించింది. డెయిరీ, పౌల్ట్రీఫాంలకు విరివిగా రుణాలు ఇవ్వనుంది. వ్యవసాయ పంట రుణాలను సైతం మరింత పెంచనుంది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్, హయత్‌నగర్, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో ఏటా పట్టణీకరణ ఊపందుకుంటోంది. విద్య, ఉద్యోగ, వ్యాపార నిమిత్తం అన్ని వర్గాల ప్రజలు అర్బన్ ప్రాంతాల్లో నివసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ప్లాట్లు, ఇంటి నిర్మాణాల కోసం రుణాలవైపు చూస్తున్నారు. అలాంటి వారికి డీసీసీబీ ఆర్థిక హస్తం అందించేందుకు సిద్ధమంటోంది.



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

ఆలస్యం చేస్తే ఆస్తుల జప్తే..

విరివిగా రుణాలిచ్చేందుకు ముందుకొస్తున్న డీసీసీబీ రికవరీ విషయంలోనూ అదే దూకుడు ప్రదర్శించాలని భావిస్తోంది. దీర్ఘకాలిక రుణాలు పొందిన వారు ఐదు నుంచి పదేళ్ల కాల వ్యవధిలో వడ్డీతో సహా మొత్తం బకాయి చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించని పక్షంలో మొండి బకాయిదారులపై ఉక్కుపాదం మోపడానికి ఆస్తుల జప్తు అస్త్రాన్ని ప్రయోగించనుంది. 2024–25 ఏడాదికి గాను వసూళ్ల లక్ష్యం రూ.250 కోట్లకు గాను ఈ ఏడాది మార్చి 30లోపు రూ.160 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 వేల మందికి పైగా రైతులతో పాటు రుణాలు పొందిన వారికి డీసీసీబీ లీగల్ సెల్ హెచ్చరిక, ఆస్తుల జప్తు నోటీసులు పంపింది. దీనికి కొందరు స్పందించగా, మరికొందరు మొండికేశారు. మొండి బకాయిదారులకు జూన్ 30లోపు చెల్లించేలా అవకాశం కల్పించారు. ఆలోగా కట్టకుంటే మరోసారి లీగల్ నోటీసులిచ్చి రుణాలు పొందే సమయంలో తాకట్టు పెట్టిన వ్యవసాయ భూములతో పాటు, ఇళ్లు, ప్లాట్ల ఆస్తుల జప్తు కోసం సిద్ధమవుతున్నారు.

కమర్షియల్ బ్యాంకులకు దీటుగా..



మధ్య తరగతి ప్రజల కలలసౌధం కోసం ప్లాట్ల కొనుగోలుతో పాటు ఇంటి నిర్మాణాలకు 60 శాతం మేర రుణాలివ్వాలని నిర్ణయించాం. ఇప్పటికే రుణాల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించాలని అన్ని పీఏసీఎస్‌ల చైర్మన్లు, సీఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. కమర్షియల్ బ్యాంకులకు దీటుగా భవిష్యత్తులో డీసీసీబీ ద్వారా ఆర్థిక లావాదేవీలు జరిపేలా కృషి చేస్తున్నాం.

– కొత్తకుర్మ సత్తయ్య, డీసీసీబీ చైర్మన్

కోనేరులో పూడికతీత

కుల్కచర్ల: మండలంలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ఉన్న సిద్ధి రామయ్య ఆలయం ఎదుట ఉన్న కోనేరులో గురువారం పూడికతీత పనులు ప్రారంభించారు. కొన్నేళ్లుగా మట్టితో నిండిపోవడంతో పాలకమండలి సభ్యులు కోనేరు పూడికతీతకు నిర్ణయించి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పాంబండ దేవస్థానం ఆలయ ప్రతిష్టను పెంపొందించేందుకు నిర్విరామంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీటీసీ డీఎస్పీగా శ్రీనివాసులు



డీటీసీ ప్రిన్సిపల్ మురళీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీనివాసులు

అనంతగిరి: వికారాబాద్‌లోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం డీఎస్పీగా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం నిర్వహించిన బదిలీలో భాగంగా బాలనగర్ ట్రాఫిక్ ఏసీపీగా పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం డీటీసీ ప్రిన్సిపల్ మురళీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

క్లుప్తంగా

సైబర్ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్: నకిలీ సిమ్‌కార్డులను ఉపయోగించి సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని వెస్ట్‌జోన్ సైబర్ సెల్ సహాయంతో బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన షేక్ మున్వర్ బాషా సిమ్ ప్రమోటర్‌తో పాటు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి కేటాయించిన డెమో సిమ్‌కార్డులను నకిలీ చిరునామాలతో ఉపయోగించి సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఓఎల్ఎక్స్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ముఖ్యంగా ఐఫోన్ మొబైల్స్‌కు సంబంధించి ప్రకటలు ఇచ్చిన వారి వివరాలను సేకరిస్తారు. ఆ వివరాల ఆధారంగా ఆ ప్రకటనను తమ సొంత ప్రకటనగా మార్చుకుని మళ్లీ పోస్ట్ చేస్తాడు. ఫోన్‌ను కొనుగోలు చేయాలనుకునేవారు సదరు ప్రకటనను చూసి కాల్ చేస్తే మున్వర్, అతని అనుచరులు ఫోన్ ద్వారా సమన్వయం చేసుకుంటారు. ఫోన్ కొనాలనుకునే వ్యక్తిని, అసలైన ఫోన్ యజమానిని ఒక చోటకు వచ్చేలా చేస్తారు. ఫోన్ కొనుగోలు చేసిన వ్యక్తి ఆన్‌లైన్‌లో చెల్లించిన మొత్తం మున్వర్‌బాషా అకౌంట్‌లోకి రాగానే ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి అదృశ్యమవుతారు. ఇలా పలువురిని మోసం చేశారు. మున్వర్ రెండు తెలుగు రాష్ట్రాల్లో మూడు వేర్వేరు మొబైల్ నెంబర్లను ఉపయోగించి 14 నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మొయినాబాద్: గుర్తుతెలియని వాహనం వెనుకనుంచి స్కూటీని ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌లోని హుస్సేన్ నగర్‌కు చెందిన ఎండీ అహ్మద్ ఖాన్, అతని మామ సయ్యద్ సలీం గత నెల 28న రాత్రి రాజేంద్రనగర్ నుంచి మొయినాబాద్‌కు స్కూటీపై వెళ్తుండగా హిమాయత్‌నగర్ సమీపంలోని స్వామినారాయణ్ గురుకుల పాఠశాల వద్దకు చేరుకోగానే వెనక నుంచి అతివేగంతో వచ్చిన వాహనం ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయమై గురువారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన షానవాజ్, బిహార్‌కు చెందిన అశోక్‌కుమార్ సిన్హా (50) కొన్నేళ్లుగా కొత్తూరు పట్టణంలో సిమెంట్ బ్రిక్స్ తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి వారు ద్విచక్ర వాహనంపై షాద్‌నగర్ నుంచి కొత్తూరు వైపునకు వస్తుండగా మార్గమధ్యలో వినాయకస్టీల్ కూడలి జాతీయ రహదారి వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షానవాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అశోక్‌ను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసేలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళకు గాయాలు

కొత్తూరు: అనుమానాస్పదస్థితిలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని ఎస్‌బీపల్లిలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహారావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అరుణమ్మ (39)కు కొన్ని రోజులుగా మానసికస్థితి సరిగా లేదు. దీనికి తోడు ఆమెకు కల్లు, మద్యం తాగే అలవాటుంది. ఈ క్రమంలో బుధవారం కల్లు తాగడానికి వెళ్లి గ్రామ సమీపంలోని అర్జునయ్య పొలంలో తలకు తీవ్ర గాయాలై పడి ఉంది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న వారు చికిత్స నిమిత్తం ఆమెను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలు కోమాలో ఉండి చికిత్స పొందుతోంది. కేసు దర్యాప్తులో ఉంది.

స్తంభించిన మెట్రో సర్వీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మెట్రో సరీ్వసులు మరోసారి స్తంభించాయి. ఎల్‌బీనగర్–మియాపూర్ కారిడార్‌లో సాంకేతిక సమస్యల కారణంగా మెట్రో సేవలకు అంతరాయం ఏర్పడింది. గురువారం మధ్యాహ్నం సుమారు 20 నిమిషాల పాటు మెట్రో సేవలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సిగ్నలింగ్‌లో తలెత్తిన సమస్యల కారణంగా మెట్రో రైళ్లు ఆగిపోయినట్లు అధికారులు తెలిపారు. కేవలం 9 నిమిషాల వ్యవధిలో సమస్యను పరిష్కరించినప్పటికీ రైళ్ల పునరుద్ధరణకు మరికొంత సమయం పట్టినట్లు పేర్కొన్నారు. మెట్రో సేవలకు అంతరాయం ఏర్పడడంతో ఎల్‌బీనగర్, ఎంజీబీఎస్, నాంపల్లి, అమీర్‌పేట్, మియాపూర్ తదితర స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. మెట్రోల కోసం ప్రయాణికులు పడిగాపులు కాశారు. సేవలను పునరుద్ధరించినప్పటికీ రద్దీ కారణంగా ఎదురుచూపులు తప్పలేదు.

ఆదాచేస్తేనే ‘గృహజ్యోతి’

- ఎండల నేపథ్యంలో పెరుగుతున్న విద్యుత్ వాడకం
- 200 యూనిట్లు దాటితే జీరో బిల్లు లేనట్లే
- కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే చేతికందనున్న పథకం



మహేశ్వరం: ఎండలు దంచికొడుతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతోంది. ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు, ఏసీల వాడకం పెరుగుతోంది. ఫలితంగా విద్యుత్ వినియోగం పైపైకి ఎగబాకుతోంది. ఈ తరుణంలో నెలవారీ యూనిట్లు 200 దాటితే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం వర్తించదు. జీరో బిల్లు రావాలంటే కరెంట్‌ను పొదుపుగా వాడటం అనివార్యం. వినియోగదారులు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రయోజనం చేకూరుతుంది. మహేశ్వరం మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో 29,544 మంది గృహ విద్యుత్ వినియోగదారులు, వీరిలో 10,722 మంది గృహజ్యోతి పథకానికి అర్హులు ఉన్నారు. గత మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.43,11,000 సబ్సిడీ విడుదలైంది. వీరంతా 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తూ జీరో బిల్లుతో లబ్ధిపొందారు.

ఇవి పాటించాలి

- మార్కెట్‌లో 5స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ ఉపకరణాలు మాత్రమే వినియోగించాలి.
- ఇంట్లో టీవీ అవసరం లేకపోతే రిమోట్‌తో కాకుండా పూర్తిగా ఆఫ్ చేయాలి.
- చార్జింగ్ పూర్తయ్యాక ఫోన్‌ను ప్లగ్ నుంచి తొలగించాలి.
- అవసరమైతేనే ఫ్యాన్లు, కూలర్లు వేయాలి.
- రిఫ్రిజిరేటర్‌లో కాలానుగుణంగా ఫ్రీజర్ లెవల్స్‌ను మార్చుకోవాలి.
- ఏసీల ఫిల్టర్లను తరచూ శుభ్రం చేస్తూ, టైమర్‌ను సెట్ చేసుకోవాలి.
- వాషింగ్‌మెషీన్‌లో లోడ్‌కు తగిన దుస్తులు మాత్రమే వేయాలి.
- నాణ్యమైన ఎల్‌ఈడీ బల్బులు వాడాలి.
- అవసరం ఉన్న గదుల్లో, అవసరమైనంత సేపే లైట్లు వేసుకోవాలి.
- ఫ్రిజ్ డోర్‌ను పదేపదే తీయకూడదు. సాధ్యమైనంత త్వరగా మనకు అవసరమైన వస్తువును తీసుకుని వెంటనే డోర్ మూసేయాలి.

పొదుపుగా వాడాలి



వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. బల్బులు, ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు, ఐరన్ బాక్సులు వంటివి అవసరానికి మించి ఉపయోగించొద్దు. ఐఎస్ఐ మార్కు ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను మాత్రమే వాడాలి. సరైన జాగ్రత్తలు పాటిస్తేనే గృహజ్యోతి వర్తిస్తుంది.

– చక్రపాణి, విద్యుత్ ఏఈ

కొహెడలో భూ వివాదం

- ఇరువర్గాల ఘర్షణలో నలుగురికి గాయాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు



హయత్‌నగర్: ఓ భూ వివాదానికి సంబంధించి ఇరువర్గాల వారు పరస్పరం దాడి చేసుకున్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడ సర్వే నంబర్ 951, 952లోని సుమారు ఏడున్నర ఎకరాల భూమిని గ్రామానికి చెందిన కంగుల రాములు, పోచయ్యతో పాటు మరికొంత మంది నుంచి కంగుల గండయ్య, ఈదయ్య జీపీఏ చేసుకున్నారు. అనంతరం 1970లో ఈస్థలంలో 170 ప్లాట్లు చేసి విక్రయించారు. అయితే ఈ జీపీఏ చెల్లదంటూ కంగుల కుటుంబానికి చెందిన పలువురు వారసులు, ఇదే భూమిని 2013లో బ్రాహ్మణపల్లికి చెందిన సంరెడ్డి బాల్‌రెడ్డికి విక్రయించారు. ఆయన కొంత విస్తీర్ణంలో ఫాంహౌస్‌తో పాటు చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఈ నేపథ్యంలో 2014 నుంచి ప్లాట్ల యజమానులు, బాల్‌రెడ్డికి మధ్య వివాదం కొనసాగుతోంది. దీనిపై ప్లాట్ల యజమానులు కోర్టును ఆశ్రయించగా 28 మార్చి 2025న జిల్లా న్యాయస్థానం వీరికి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వీటి ఆధారంగా ప్లాట్ల యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో లే అవుట్ రోడ్లను ఆక్రమించి ఫాంహౌస్ నిర్మించారనే కారణంతో రెండు నెలల క్రితం హైడ్రా అధికారులు ఫాంహౌస్ చుట్టూ ఉన్న ప్రహరీని కూల్చేశారు. దీన్ని సవాలు చేస్తూ బాల్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించడంతో హైడ్రా, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ఇందులో జోక్యం చేసుకోవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా కొంతమంది ప్లాట్ల ఓనర్లు గురువారం తమ స్థలాలను చదను చేసుకునేందుకు జేసీబీ తీసుకుని వెళ్లారు. ఇది గమనించిన బాల్‌రెడ్డి, అతని అనుచరులు దిలీప్‌రెడ్డి, శీలం శ్రీను తదితరులు ప్లాట్ల యజమానులైన సత్యనారాయణరెడ్డి, పందుగల వెంకటేశ్, నవీన్‌రెడ్డి, బద్రి అశోక్, రఘు వెంకట్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. బాల్‌రెడ్డి వర్గం వారు రాళ్లు, కర్రలు, గడ్డి కత్తిరించే కత్తితో దాడి చేయడంతో సత్యనారాయణరెడ్డి, నవీన్, వెంకటేశ్‌కు గాయాలయ్యాయి. వీరి ప్రతిఘటనతో బాల్‌రెడ్డికి సైతం గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

పహాడీషరీఫ్: ఓ బాలిక అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్‌కు చెందిన ఖాజా పాషా చిన్న కుమార్తె షహనా బేగం (17) ఎనిమిదో తరగతి వరకు చదివి, ఇంటి వద్దే ఉంటోంది. గత ఏప్రిల్ 29న సోదరి వద్దకు వెళ్తున్నట్లు చెప్పి తిరిగిరాలేదు. ఈ విషయమై పెద్ద కూతురును వాకబు చేయగా, అక్కడికి రాలేదని తెలిసింది. బాలిక ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ ఉండడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా గాలించారు. ఫలితం లేకపోవడంతో గురువారం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

షాబాద్: విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లారెడ్డి గూడలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డి గూడ గ్రామానికి చెందిన మీసాల వెంకటయ్య పాడి ఆవు గురువారం పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ఎర్త్‌వైర్ తగిలి షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబాలనికి ఆసరగా ఉన్న పాడి ఆవు మృతితో రైతు బోరున విలపించాడు. దాని విలువ సుమారు రూ.2.5 లక్షల వరకు ఉంటుందన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఆవు మృతి చెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

‘మెగా వెంచర్’ సందర్శన

కందుకూరు: గత ప్రభుత్వ హయాంలో ఫార్మా సిటీ భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు కేటాయించడానికి మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేసిన మెగా వెంచర్‌ను గురువారం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కమిషనర్ కె.శశాంక సందర్శించారు. అక్కడ లేఅవుట్‌లో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ఎక్కడెక్కడ ఏమేమి వస్తున్నాయి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మెట్రో బాదుడే!

- నష్టాలను అధిగమించే యోచన
- చార్జీల పెంపునకు కసరత్తు
- త్వరలో 20 శాతం వడ్డింపు

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో మెట్రో చార్జీలు పెరగనున్నాయి. కొంతకాలంగా చార్జీలను పెంచేందుకు ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైల్ కసరత్తు చేపట్టిన సంగతి తెలిసిందే. వరుస నష్టాలను అధిగమించేందుకు చార్జీల పెంపు అనివార్యంగా మారినట్లు అధికారులు అంచనాకు వచ్చారు. ప్రస్తుతం రూ.6,500 కోట్ల నష్టాలతో నగరంలో మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. కొద్దిరోజులుగా ప్రయాణికుల రాకపోకల్లోనూ హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయి. సగటున 5 లక్షల మంది ప్రయాణిస్తున్నట్లు అంచనా ఉన్నప్పటికీ తరచూ 4.8 లక్షల నుంచి 5 లక్షలలోపే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మహాలక్ష్మి ఎఫెక్ట్..

సిటీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో చాలా మంది మహిళలు వాటివైపే మొగ్గు చూపుతున్నారు. విద్యార్థినులు, ఉద్యోగినులు సైతం మెట్రో నుంచి సిటీబస్సుల వైపు మళ్లినట్లు సమాచారం. ఎల్‌బీనగర్–మియాపూర్, నాగోల్– రాయదుర్గం కారిడార్లలో ప్రయాణికుల రద్దీ ఉన్నా జేబీఎస్–ఎంజీబీఎస్ రూట్‌లో వీరి సంఖ్య రోజురోజుకూ పడిపోతోంది. ఈ క్రమంలో నష్టాలను ఎదుర్కొనేందుకు చార్జీల పెంపు మినహా మరో గత్యంతరం కనిపించడం లేదని ఓ అధికారి తెలిపారు.

ప్రభుత్వ అనుమతితో..

నగరంలో 2017 నుంచి మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటినుంచి చార్జీలు పెంచలేదు. ఇదే సమయంలో బెంగళూరు, చెన్నై, ఢిల్లీలో రెండు నుంచి మూడుసార్లు చార్జీలు పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే చార్జీలను పెంచాలని ప్రతిపాదించినప్పటికీ అప్పట్లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అంగీకరించలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెట్రో నష్టాలపై ఎప్పటికప్పుడు తెలియజేస్తూనే చార్జీల పెంపు కోసం అనుమతిని కోరారు. తాజాగా ప్రభుత్వం నుంచి సూత్రప్రాయంగా అనుమతి లభించినట్లు తెలిసింది.

కొద్దిరోజుల్లోనే స్పష్టత..

ఇప్పుడున్న చార్జీలపై గరిష్ఠంగా 20 శాతం వరకు పెంచే యోచన ఉంది. ప్రస్తుతం కనిష్ఠంగా రూ.10, గరిష్ఠంగా రూ.60 వరకు మెట్రో చార్జీలు ఉన్నాయి. 20 శాతం పెంచితే రూ.15 నుంచి రూ.75 వరకు పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు. మెట్రో చార్జీలు ఏ మేరకు పెరగనున్నాయనే అంశంపై కొద్ది రోజుల్లోనే స్పష్టత రానుందని అధికారులు పేర్కొన్నారు. చార్జీల పెంపు వల్ల ఇప్పుడున్న నష్టాలను అధిగమించేందుకు కొంతవరకు ఊరట లభిస్తుందని భావిస్తున్నారు.



మీర్‌పేటలో కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ప్రభుత్వ హామీలపై నిలదీస్తాం

ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిలదీస్తామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన 83 మంది లబ్ధిదారులకు గురువారం చెక్కులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వంద రోజుల్లో అమలు చేస్తామన్న ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం నెరవేర్చడంతో పాటు చెక్కులు తీసుకున్న వారందరికీ తులం బంగారం కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంత వరకు మహిళలకు నెలకు రూ.2,500 ఎక్కడా ఇవ్వలేదని విమర్శించారు. మహిళలను కోటీశ్వరులని చేస్తామని ప్రభుత్వం చెబుతోందని, త్వరలోనే మీర్‌పేట, జిల్లెలగూడలో ఇంటింటికీ వెళ్లి ఎవరు కోటీశ్వరులు అయ్యారో తెలుసుకుంటానని ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి పథకాన్ని మహిళలను దృష్టిలో పెట్టుకుని అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీటీ మణిపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు అర్కల భూపాల్‌రెడ్డి, అనిల్‌యాదవ్, బొక్క రాజేందర్‌రెడ్డి, జటావత్ శ్రీనునాయక్, అర్కల కామేష్‌రెడ్డి, భూపేష్‌గౌడ్, మాదరి రమేష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వామ్మో ఎండలు!

ధారూరు: పెరుగుతున్న ఎండలతో ప్రజలు బయటకు వచ్చేందుకే జంకుతున్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచే ఎండలు దంచి కొట్టడంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. రాకపోకలు లేకపోవడంతో ఉదయం, సాయంత్రం వేళలో వ్యాపారాలు కొనసాగుతున్నాయి. భానుడి భగభగలతో కూలీలు సైతం భయకంపితులై పనులకు వెళ్లడం లేదు. మధ్యాహ్నం వేళ ఎక్కడ చూసినా నిర్మానుష్యంగా కనిపిస్తోంది. ధారూరు ప్రధాన రోడ్డులో జన సంచారం లేక వెలవెలబోయింది.



వెలవెలబోతున్న ధారూరు ప్రధాన రోడ్డు

ఎన్నికల హామీ మేరకే చిలుక వాగు ప్రక్షాళన

తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి



చిలుక వాగు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు

తాండూరు: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కృషి వల్లే చిలుక వాగు ప్రక్షాళన పనులు వేగంగా జరుగుతున్నాయని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హబీబ్‌లాల పేర్కొన్నారు. గురువారం తాండూరు మున్సిపల్ పరిధిలోని 9 వార్డు సాయిపూర్ ప్రాంతంలో రూ.16 కోట్లతో చేపట్టిన చిలుక వాగు అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా చిలుక వాగు కబ్జాకు గురైందన్నారు. గతంలో ఎంతో మంది నేతలు చిలుక వాగు అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నది తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అని పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలంలో సాయిపూర్, గ్రీన్ సిటీ ప్రాంతాలు నీటి ముంపునకు గురి కాకుండా చిలుక వాగులోనే వరద ప్రవహిస్తోందన్నారు. వీరితో పాటు నాయకులు బంటు వేణుగోపాల్, బంటు మల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

అందంగా.. సుందరంగా..

త్వరలో మిస్ వరల్డ్ పోటీలు

- సన్నద్ధమవుతున్న నగరం

సాక్షి, సిటీబ్యూరో: నగర విశిష్టతల్లో తలమానికంగా చేరనున్న మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కార్యక్రమం ‘మిస్ వరల్డ్ 2025’ పోటీలు. ఇందులో భాగంగా నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఈ ప్రణాళికల్లో భాగంగా ఇప్పటికే నిర్వహణ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 7 నుంచి 31 వరకు మిస్ వరల్డ్ పోటీలు జరగడం నగరానికే గర్వకారణం. ఇందులో భాగంగా పలు ప్రత్యేక ప్రాంతాల్లో క్రౌన్ రూపంలో ప్రతిమలు, లైటింగ్ ఎఫెక్టులు, అధునాతన హంగులను రూపొందించనున్నారు. మిస్ వరల్డ్ పోటీలు జరిగే ప్రధాన ప్రాంతమైన హైటెక్స్ వేదిక సమీప ప్రాంతాలను అంతర్జాతీయ ప్రముఖులు హౌరా అనేలా రమణీయంగా తీర్చిదిద్దుతున్నారు. పలు ప్రాంతాల్లో కళ్లు మిరుమి ట్లుగొలిపే థీమ్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. హైటెక్ సిటీలోని దుర్గం చెరువు, ఏఎంబీ మాల్, గచ్చిబౌలి, రాయదుర్గం మెట్రో స్టేషన్ల వద్ద సెల్ఫీ పాయింట్లు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు.

సందడి చేయనున్న గ్లోబల్ సెలబ్రిటీలు..

మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో దాదాపు 130 దేశాల నుంచి అంతర్జాతీయ ప్రముఖులు నగరానికి రానున్నారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్ రోడ్‌లో 130 దేశాలకు చెందిన జాతీయ పతాకాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ అంతర్జాతీయ అతిథుల కోసం ఇప్పటికే ట్రైడెంట్ హోటల్‌ను నెల రోజుల పాటు ముందస్తుగానే బుక్ చేయడంతో పాటు పలు 5 స్టార్, 3 స్టార్ హోటళ్లను వినియోగించుకోనున్నారు. మాజీ ప్రపంచ సుందరీమణులు, గ్లోబల్ సినీ ప్రముఖులు, విదేశాంగ ప్రముఖులు ఇతర విభిన్న రంగాలకు చెందిన సెలబ్రిటీలు నగరానికి విచ్చేయనున్నారు. ఈ నెల 2న నగరంలోని హైటెక్స్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన సమగ్ర వివరాలను వెల్లడించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు సోనూసూద్, మాజీ మిస్ ఇండియా నందినీ గుప్తా ముఖ్య అతిథులుగా వస్తున్నట్టు సమాచారం. 10న జరగనున్న ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు.

డిజిటల్ డిస్‌ప్లేకు నో

స్టాండింగ్ కమిటీ తిరస్కారం

సాక్షి, సిటీబ్యూరో: దుకాణాలు, బ్యాంకులు తదితర సంస్థలకు ఎల్‌ఈడీ డిజిటల్ స్టాటిక్ బోర్డుల ఏర్పాటుకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ బ్రేక్ వేసింది. ఈ ప్రతిపాదనకు స్టాండింగ్ కమిటీ ఆమోదించలేదు. గతంలో తిరస్కరించిన చెరువుల పునరుద్ధరణకు నామినేషన్‌పై ‘నీరి’ని టెక్నికల్ కన్సల్టెంట్‌గా నియమించే ప్రతిపాదనను మళ్లీ పెండింగ్‌లో పెట్టింది. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం వివిధ రహదారుల విస్తరణకు సిఫారస్ చేసింది. సమావేశంలో 9 అంశాలతో పాటు 2 టేబుల్ అంశాలకు ఆమోద ముద్ర వేసినట్లు మేయర్ తెలిపారు. అడిషనల్, జోనల్ కమిషనర్లు ఆయా విభాగాలకు సంబంధించిన టెండర్లు తదితర నిర్ణయాలన్నింటినీ స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన తర్వాతే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆమోదం లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోరాదని సూచించారు. సమావేశంలో కమిషనర్ కర్ణన్, స్టాండింగ్ కమటీ సభ్యులు, ఆయా విభాగాల ఉన్నతాధకారులు పాల్గొన్నారు.

అయోమయం.. ఆగమాగం

బల్దియా పాలన గందరగోళం

- కమిషనర్‌తో పాటు కొందరు ఏసీలు, జడ్‌సీలూ కొత్తవారే
- పది నెలల వ్యవధిలో మారిన నలుగురు కమిషనర్లు
- సమస్యల్ని సృష్టిస్తోన్న ఈ తరహా వ్యవహారం
- రాజకీయ పరంగానూ విమర్శలకు తావు



సాక్షి, సిటీబ్యూరో: కోటి మందికిపైగా ప్రజలకు వివిధ సేవలు, నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాల్సిన జీహెచ్ఎంసీకి పది నెలల్లో నలుగురు కమిషనర్లుగా రావడంతో పరిస్థితి అయోమయంగా మారింది. పాలన గందరగోళంగా తయారైంది. పది నెలల వ్యవధిలో రోనాల్డ్‌రాస్, ఆమ్రపాలి, ఇలంబర్తి తర్వాత ప్రస్తుతం కర్ణన్ కమిషనర్‌గా వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌ను తరచూ మారుస్తుండటం రాజకీయంగా విమర్శలతో పాటు పాలన పరంగా సమస్యలు సృష్టిస్తోంది. ఒక కమిషనర్ తనదైన శైలిలో కార్యక్రమాలను పట్టాలెక్కించే లోపునే మారిపోతుండటంతో పరిస్థితి ఎప్పటికప్పుడు మొదటికి వస్తోంది. రోనాల్డ్‌రాస్ తర్వాత ఆమ్రపాలిని కమిషనర్‌గా నియమించినప్పుడు ఉన్నవారిలో సీనియర్ అయినందున నియమించినట్లు సీఎం అప్పట్లో విలేకరులతో ఓ సందర్భంలో చెప్పారు. ప్రస్తుతం సీనియారిటీకీ సైతం తిలోదకాలిచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోనాల్డ్‌రాస్, ఆమ్రపాలి మారడానికి కారణాలున్నాయి కానీ ఇలంబర్తిని మార్చడానికి కారణాలంటూ కనిపించడం లేదు. పైపెచ్చు ఇప్పుడిప్పుడే తగిన చర్యలతో జీహెచ్ఎంసీలో క్రమశిక్షణతోపాటు, అవినీతికి అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్న తరుణంలో ఉన్నట్లుండి మార్చడంతో ఎందుకిలా చేస్తున్నారో తెలియడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆయన వస్తారో.. రారో..

- తనకంటే జూనియర్‌ను కమిషనర్‌గా నియమించడంతో ఆయన వద్ద అడిషనల్ కమిషనర్‌గా పని చేయలేననే తలంపుతో కిల్లు శివకుమార్ నాయుడు సెలవుపై వెళ్లినట్లు జీహెచ్ఎంసీ వర్గాల్లో వినిపిస్తోంది. ఆయన జీహెచ్ఎంసీకి వస్తారో.. రారో తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. మరోవైపు, దీర్ఘకాలిక సెలవులో ఉన్న అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ తిరిగి విధుల్లో చేరారు. ఆమెకు ఇంకా బాధ్యతలు కేటాయించలేదు. ఆమె సెలవులో వెళ్లడంతో ఆమె బాధ్యతల్ని ఇతరులకు అప్పగించారు. వారు తమదైన ప్రణాళిక, లక్ష్యాలతో పనులు చేస్తున్నారు. తిరిగి వారికా విధులు తప్పిస్తే మళ్లీ గందరగోళమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
- ఒకవేళ.. శివకుమార్ నాయుడు జీహెచ్ఎంసీకి ఇక రాని పరిస్థితుల్లో ప్రస్తుతం ఆయన పరిధిలో ఉన్న విద్యుత్, చెరువులు, ఎస్ఎన్‌డీపీ, భూసేకరణ విభాగాలను స్నేహశబరీష్‌కు అప్పగించవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఆమె వివిధ విభాగాలను సమర్థంగా నిర్వహించడంతో వీటిని ఆమెకు అప్పగిస్తారని భావిస్తున్నారు. లేని పక్షంలో మళ్లీ కొత్త గందరగోళాలు తలెత్తుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శివకుమార్ నాయుడు వద్ద ఉన్న హౌసింగ్ విభాగాన్ని ఇప్పటికే నళినీ పద్మావతికి అప్పగించారు. బదిలీపై జీహెచ్ఎంసీకి తిరిగి వచ్చిన భోర్ఖడే హేమంత్ సహదేవ్ రావు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

అభివృద్ధి, సంస్కరణలు జరుగుతున్నా..

మరోవైపు.. జీహెచ్ఎంసీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్ని సరిగా ప్రచారం చేసుకోలేకపోతున్నారనే విమర్శలున్నాయి. రెగ్యులర్ సీపీఆర్ఓ లేకపోవడంతో మొక్కుబడి ప్రకటనలు తప్ప జీహెచ్ఎంసీలో ఎన్నో సంస్కరణలు, కొత్త కార్యక్రమాలు ప్రవేశపెట్టినా తెలియడం లేదు. పైపెచ్చు తరచూ తప్పుడు సమాచారం అందుతోందనే ఆరోపణలున్నాయి. గతంలో సీపీఆర్ఓ కార్యాలయం సమర్థంగా పనిచేసేది. ప్రస్తుతం ఆ విభాగాన్ని గాలికి వదిలేశారని చెబుతున్నారు.

మిస్ వరల్డ్ పోటీలపై ప్రత్యేక శ్రద్ధ

‘మిస్ వరల్డ్ –2025’ పోటీలకు హైదరాబాద్ వేదిక కావడంతో అందరి చూపూ నగరంపై పడింది. ఈ నేపథ్యంలో వివిధ మార్గాల్ని, ఆయా ప్రాంతాల్ని సర్వాంగ సందరంగా తీర్చిదిద్దడంపై ప్రస్తుతం దృష్టి సారించారు. పోటీల ప్రారంభ కార్యక్రమం గచ్చిబౌలిలో జరగనుండగా, పోటీలో పాల్గొనే వారు చార్మినార్, లాడ్‌బజార్, చౌమహల్లా ప్యాలెస్, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, శిల్పారామం, ఫలక్‌నుమా ప్రాంతాలను సందర్శించనుండటంతో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక లైటింగ్ తదితర ఏర్పాట్లు చేయనున్నారు.